ఉద్యానవనాల్లో మేటి

- నగరానికి తలమానికంగా మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్క్
- రాష్ట్రంలోనే తొలి సోలార్ డిజిటల్ పార్కుగా గుర్తింపు
- సందర్శకుల మనసు దోచేలా నిర్వహణ


స్కేటింగ్ రింక్‌లో రోల్‌బాల్ క్రీడలో విద్యార్థులు


మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్క్‌లో పచ్చదనం

మురళీనగర్: నగరంలో ఎన్ని ఉద్యానవనాలున్నా.. మురళీనగర్‌లోని వైశాఖి స్పోర్ట్స్ పార్క్ ప్రత్యేకతే వేరు. పచ్చని వాతావరణం మధ్య ఆధునిక సదుపాయాలతో సందర్శకుల మనసు దోచేస్తుంది. ఇక్కడ అడుగు పెట్టగానే బృందావన విహారం చేసిన అనుభవం కలుగుతుంది. ముఖ్యంగా రాష్ట్రంలోనే మొట్టమొదటి సోలార్ ఎనర్జీ పార్కుగా ఇది గుర్తింపు పొందింది. ఉదయం, సాయంత్రం వేళల్లో సందర్శకులు, వాకర్స్, వ్యాయామం చేసేవారితో నిత్యం సందడిగా కనిపిస్తుంది. ఈ పార్కు గ్రేటర్ విశాఖకు తలమానికంగా నిలుస్తుంది.

పచ్చదనం.. ఆహ్లాదకరం.. ఆధునికత

వైశాఖి స్పోర్ట్స్ పార్కును 2002లో స్థానికులు పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు శ్రీకారం చుట్టారు. కేవలం 30 మందితో ప్రారంభమై నేడు 897 మంది సభ్యులకు సంఖ్య చేరింది. ఇక్కడ శాశ్వత సభ్యత్వం తీసుకోవాలంటే రూ.10 వేలు చెల్లించాల్సి ఉంటుంది. ఈ పార్కులోకి ప్రవేశించగానే పచ్చదనం.. ఆహ్లాదకర వాతావరణం ఆహ్వానిస్తుంది. సందర్శకులకు అవసరమైన అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు. పార్కులో అందరూ భారతీయ సంప్రదాయాలకు అత్యంత ప్రాధాన్యమిస్తారు. ఆధునిక టెక్నాలజీని అందిపుచ్చుకుని పార్కును అభివృద్ధి చేశారు. భూగర్భ డ్రైనేజీ, భూగర్భ కేబుల్ వైరింగ్ ఏర్పాటు చేశారు. వాకింగ్ ట్రాక్‌ను మట్టితో అధునాతనంగా తీర్చి దిద్దారు. పిరమిడ్ ధ్యాన కేంద్రంలో ప్రశాంతంగా ధ్యానం చేసుకోవచ్చు.

సౌర శోభ

రాష్ట్రంలోనే తొలి సోలార్ డిజిటల్ పార్కుగా వైశాఖి స్పోర్ట్స్ పార్కు గుర్తింపు పొందింది. ప్రభుత్వం ఇచ్చిన రాయితీని సద్వినియోగం చేసుకుని నెడ్‌క్యాప్ సహకారంతో సొంతంగా 10 కిలో వాట్ సామర్థ్యం కలిగిన సోలార్ విద్యుదుత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఇందుకయ్యే రూ.8 లక్షల ఖర్చులో 20 శాతం రాష్ట్ర ప్రభుత్వం, 30 శాతం కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వగా.. మిగతా నగదును పార్కు నిర్వహణ కమిటీ భరించింది. ప్రతి రోజూ 50 యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తుంది. రోజువారీ విద్యుత్ వినియోగానికి సంబంధించి రికార్డు చేసే ఆధునిక వ్యవస్థను ఏర్పాటు చేశారు.

అందరికీ సౌకర్యాలు.. ఎన్నో ప్రత్యేకతలు

ఈ పార్కును సందర్శించే అన్ని వయసుల వారికి అనుగుణంగా ఇక్కడ సౌకర్యాలు ఏర్పాటు చేశారు. మహిళలు సామాజిక సేవా కార్యక్రమాలు, సమావేశాల నిర్వహణ, మహిళలు, చిన్నపిల్లల కోసం శిక్షణ కార్యక్రమాల నిర్వహణకు వైశాఖి భవనం అందుబాటులో ఉంది. ఇతర అంతస్తుల్లో జిమ్, శాస్త్రీయ నృత్య శిక్షణకు ఏర్పాట్లు చేశారు.


పార్క్‌లో వాకింగ్ చేస్తున్న స్థానికులు

- పార్కులో పిల్లల కోసం ఏర్పాటు చేసిన స్కేటింగ్ రింక్‌లో శిక్షణ పొందిన విద్యార్థులు జాతీయ స్థాయిలో బంగారు పతకాలు సాధించి విశాఖ నగరానికి మంచి పేరు తెస్తున్నారు.
- ఔట్ డోర్ షటిల్ బ్యాడ్మింటన్ కోర్టు అందుబాటులో ఉంది.
- ప్రభుత్వం రూ.2 లక్షలతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ అదనపు ఆకర్షణగా చెప్పుకోవచ్చు.
- ఆధునిక స్విమ్మింగ్ పూల్ ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రజలకు అందుబాటులో ఉంది. మహిళలకు, పురుషులకు ప్రత్యేక కోచ్‌లు ఉన్నారు.
- ఇన్ గేట్ వద్ద ఏర్పాటు చేసిన మహాత్మా గాంధీ నిలువెత్తు విగ్రహం స్ఫూర్తినిస్తుంది. జీవీఎంసీ ఎదురుగా ఉన్న విగ్రహం తర్వాత ఇదే పెద్దది.
- ఇక్కడి వేములపల్లి కళాక్షేత్రంలో నిత్యం సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగుతుంటాయి.

అక్కయ్యపాలెం పరసకు ఏర్పాట్లు


విద్యుత్ వెలుగుల్లో అమ్మవారి ఆలయాలు

సీతంపేట: అక్కయ్యపాలెంలో మూడుగుళ్ల వద్ద సోమవారం జరగనున్న సీతారాముల పరసకు గౌరీ సేవా సంఘం ఘనంగా ఏర్పాట్లు చేసింది. భూలోకమాంబ, ముత్యమాంబ, కుంచమాంబ, వెంకటేశ్వరస్వామి, సీతారాముల పరస నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్టు సంఘ అధ్యక్షుడు కొయిలాడ వేణుగోపాల్ తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఎటువంటి ఆటంకాలు తలెత్తకుండా కమిటీ చర్యలు చేపట్టింది. భూలోకమాంబ, కుంచమాంబ, ముత్యమాంబ, వెంకటేశ్వరస్వామి ఆలయాలను విద్యుత్ దీపాలు, పూలదండలు, వేపమండలతో అలంకరించారు. సోమవారం తెల్లవారుజాము 5.30 గంటలకు అమ్మవార్ల తొలి పూజతో పరస ఉత్సవం ప్రారంభమవుతుంది. అనంతరం అమ్మవార్లను భక్తులు దర్శించుకుని మొక్కులు సమర్పించుకోవచ్చు. సోమవారం సాయంత్రం 4 నుంచి రాత్రి 11 గంటల వరకు సంప్రదాయ, కోలాటం, సేవా గరిడీ, డ్యాన్స్ బేబీ డ్యాన్స్, చెక్కభజన వంటి సాంస్కృతిక కార్యక్రమాలతో పరస ఉత్సాహంగా సాగుతుందని నిర్వాహకులు తెలిపారు. సంఘ గౌరవాధ్యక్షుడు పి.ఎస్.జె.వి.ప్రసాద్, చైర్మన్ రాజగిరి అప్పలరాజు, ఉపాధ్యక్షుడు మళ్ల త్రినాథరావు, డిప్యూటీ ప్రెసిడెంట్ పిళ్లా పకీరునాయుడు, ప్రధాన కార్యదర్శి ఆడారి పారుపల్లి రవి, కోశాధికారి పెంటకోట సత్యప్రసాద్, ఆడిటర్ పెంటకోట సత్యనారాయణ, పాలకవర్గ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వీరంగం సృష్టించిన వ్యక్తి అరెస్ట్


సీతమ్మధార: ఇటీవల మద్యం మత్తులో వీరంగం సృష్టించిన వ్యక్తిని ఫోర్త్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారు తెలిపిన వివరాలిలా.. తాటిచెట్లపాలెం 80 ఫీట్ రోడ్డులో జగదీష్, విమల దంపతులు తోపుడు బండిపై సమోసాలు విక్రయిస్తుంటారు. రైల్వే న్యూకాలనీకి చెందిన పాత నేరస్తుడు షేక్ కాజా మోహిదిన్ ఈ నెల 19వ తేదీ శుక్రవారం రాత్రి 7.10 గంటల సమయంలో అక్కడికి వెళ్లి సమోసా ఇమ్మన్నాడు. దుకాణదారుడు డబ్బులు అడగడంతో తోపుడు బండి అద్దాలు పగటకొట్టి అతడిపై దాడి చేసి వీరంగం సృష్టించాడు. దుకాణదారురాలు విమల ఫిర్యాదు మేరకు షేక్ కాజాను ఫోర్త్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

వెండి, బంగారం చోరీపై ఫిర్యాదు

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ ఇంట్లో వెండి, బంగారం చోరీ జరిగిన ఘటన వెలుగుచూసింది. కంచరపాలెం క్రైం పోలీసులు తెలిపిన వివరాలిలా.. జోహార్‌నగర్‌లో కుటుంబంతో కలిసి ఉమ్మడి ఎర్రయ్య నివసిస్తున్నారు. వారంతా ఈ నెల 15న కైలాసపురంలో ఉంటున్న అత్తవారింటికి పండగకు వెళ్లారు. ఈ నెల 19న ఉదయం అతడి ఇద్దరి కుమార్తెలు వారి ఇంటికి వచ్చి తిరిగి రాత్రి తాళం వేసుకుని కైలాసపురంలోని అమ్మమ్మ ఇంటికి వెళ్లిపోయారు. ఆదివారం ఉదయం కైలాసపురం నుంచి బయలుదేరి ఎర్రయ్య కుటుంబంతో తిరిగి ఇంటికి వచ్చి చూడగా తాళం పగలగొట్టి ఉండటాన్ని గమనించారు. ఇంట్లో చూడగా తులంపావు బంగారు నగలు, 10 తులాల వెండి సామాగ్రి కనిపించలేదు. దీంతో కంచరపాలెం క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్రైం సీఐ ఎన్.శ్రీనివాస్ నేతృత్వంలో ఎస్ఐ సునీల్ కేసు దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా

సిద్ధేశ్వరానంద మహాస్వామి అవతరణోత్సవం నేడు


సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి

సీతంపేట: కుర్తాళం శంకరాచార్య, శ్రీలలితా పీఠాధిపతి జగద్గురు శ్రీసిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి 88వ అవతరణ దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్టు పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 9.30 గంటలకు గురువందన సమర్పణ జరుగుతుందన్నారు. అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ట సందర్భంగా సీతారాముల పట్టాభిషేకం, మధ్యాహ్నం 12.30 గంటల నుంచి అన్నప్రసాద వితరణ నిర్వహిస్తామని చెప్పారు. భక్తులు పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

అలరించిన హాస్యామృతం షో


కామెడీ స్కిట్ ప్రదర్శిస్తున్న కళాకారులు

సీతంపేట: హాస్యప్రియ కామెడీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో నిర్వహించిన హాస్యామృతం కామెడీ షో ఆద్యంతం నవ్వులు పండించింది. క్లబ్ వ్యవస్థాపకుడు ఇమంది ఈశ్వరరావు పర్యవేక్షణలో పలువురు కళాకారులు అల్లాడి నాగరాజు, సిహెచ్.నాగార్జున, ప్రవీణ్, ఎం.రమ, ఎం.సీత, మల్లిక, పావని తదితరులు ప్రదర్శించిన కామెడీ స్కిట్లు కడుపుబ్బా నవ్వించాయి. వాటిలో టెక్నాలజీ, ఏదైనా సాధిస్తా, నలుగురు పెళ్లాల ముద్దుల మొగుడు, బస్ బే, మాటకోసం ముప్పు తిప్పలు, ఎయిర్‌పోర్టు కామెడీ స్కిట్లు ప్రేక్షకులను హాస్యంతో ముంచెత్తాయి.

నేడు ట్యాబ్‌ల పంపిణీ

సీతమ్మధార: సంక్రాంతి సెలవులు పూర్తి కావడంతో సోమవారం నుంచి పాఠశాలలు తెరవనున్నారు. ఈ సందర్భంగా సీతమ్మధార పీ అండ్ టీ కాలనీలోని ఎన్ఎంసీహెచ్ స్కూల్ పల్స్ టూలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు 211 ట్యాబ్‌లు పంపిణీ చేయనున్నారు.

అసభ్యకర మెసేజ్‌లు వస్తున్నాయంటూ ఫిర్యాదు

మర్రిపాలెం: ఓ బాలికకు గుర్తు తెలియని వ్యక్తి నుంచి అసభ్యకరమైన మెసేజ్‌లు వస్తున్నాయంటూ కంచరపాలెం ఐదో పట్టణ పోలీసులకు ఫిర్యాదు అందింది. వివరాలిలా.. సంజీవయ్య కాలనీలో తల్లిదండ్రులతో కలిసి నివసిస్తున్న ఓ బాలికకు శనివారం నుంచి ఓ గుర్తు తెలియని ఫోన్ నంబర్ నుంచి అసభ్యకరమైన మెసేజ్‌లు, ఫోన్ కాల్స్ వస్తున్నాయి. ఈమేరకు ఆదివారం కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో బాలిక ఫిర్యాదు చేసింది. సీఐ ఎస్.భాస్కర్‌రావు కేసు దర్యాప్తు చేపట్టారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్


రౌడీషీటర్లకు సూచనలిస్తున్న ఎస్ఐ ధర్మేంద్ర

సీతమ్మధార: ద్వారకా పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు ఎస్ఐ ధర్మేంద్ర కౌన్సెలింగ్ నిర్వహించి, వేలిముద్రలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్లు సత్ప్రవర్తన కలిగి ఉంటున్నారా.. లేదా అని అడిగి తెలుసుకున్నారు. సమాజంలో ఎటువంటి అల్లర్లు, తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా ఉండాలని సూచించారు. హద్దు మీరి నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తుంచుకుని మంచిగా నడుచుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కరాసా పోలీస్ క్వార్టర్స్‌లో సీపీ పర్యటన

మరమ్మతులు చేపట్టాలని ఆదేశం


కరాసా పోలీస్ క్వార్టర్స్ గృహ సముదాయాన్ని పరిశీలిస్తున్న సీపీ రవిశంకర్, అధికారులు

గోపాలపట్నం: మర్రిపాలెం వుడా లేఅవుట్‌లోని కరాసా కొత్త పోలీస్ క్వార్టర్స్‌లో ఆదివారం సీపీ డాక్టర్ రవిశంకర్ పర్యటించారు. ఇక్కడి పోలీస్ గృహ సముదాయాలను సందర్శించారు. ఇళ్ల స్థితిగతులతో పాటు డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించారు. మూడో అంతస్తులో ఉన్న ఇళ్ల సీలింగ్ పాడైందని వాటిని తక్షణమే మరమ్మతులు చేయాలని సూచించారు. డ్రైనేజీ సమస్య పరిష్కరించడంతో పాటు అన్ని భవనాలకు పెయింటింగ్ వేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయన వెంట డీసీపీ–2(లా అండ్ ఆర్డర్) ఆనందరెడ్డి, ఏసీపీలు ఆర్మ్‌డ్ రిజర్వ్ అధికారులు ఉన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయులకు ప్రత్యేక సెలవులివ్వాలి

విశాఖ విద్య: ఆడుదాం ఆంధ్రా విజయవంతంలో కీలక పాత్ర పోషించిన వ్యాయామ ఉపాధ్యాయులకు ప్రత్యేక సెలవులు ఇవ్వాలని వ్యాయామ ఉపాధ్యాయుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆముదాల అప్పలరాజు కోరారు. ఆదివారం జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి యువతలో క్రీడా స్ఫూర్తిని నింపేలా ఆడుదాం ఆంధ్రాకు శ్రీకారం చుట్టడం హర్షణీయమన్నారు. ప్రభుత్వ ప్రతిష్టను ఇనుమడింపజేయడానికి ఆడుదాం ఆంధ్రా క్రీడలను విజయవంతం చేయడంలో వ్యాయామ ఉపాధ్యాయులు పాత్ర ఎంతో ఉందన్నారు. వ్యాయామ ఉపాధ్యాయుల సేవలను గుర్తించి సెలవు రోజుల్లో పనిచేసిన కాలానికి ప్రత్యేక సెలవులు మంజూరు చేయాలని కోరారు. సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి ఎల్. లలితకుమార్, కోశాధికారి ఎస్. రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌లో కొత్త ఐసీయూ ప్రారంభం


కొత్త ఐసీయూను ప్రారంభిస్తున్న డాక్టర్ బుచ్చిరాజు, డాక్టర్ అశోక్‌కుమార్

మహారాణిపేట: కేజీహెచ్ సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌లోని యూరాలజీ వార్డులో ఆరు పడకలతో న్యూ ఐసీయూను ఆదివారం ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో యూరాలజీ ఐసీయూ కోసం భావనగర్ వార్డుకు తీసుకొని వెళ్లేవారని, నేడు సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌లోనే ఐసీయూ పెట్టడం వల్ల రోగులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కేజీహెచ్ డీసీహెచ్ఆర్ఎంవో డాక్టర్ లక్ష్మీతులసి, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.విజయలక్ష్మి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అలవోకగా 150 పద్యాల ఆలాపన


డాక్టర్ పెదవీర్రాజును సన్మానిస్తున్న నిర్వాహకులు

మహారాణిపేట: విశాఖ రసజ్ఞ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా పరిషత్ అంకోశ హాల్‌లో తెలుగు పద్య సౌరభం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉదరకోశ వ్యాధుల వైద్య నిపుణుడు డాక్టర్ ఈదర పెదవీర్రాజు ప్రముఖ కవులు రాసిన పద్యాలను అలవోకగా ఆలపించారు. 150 పద్యాలను ఏకధాటిగా చదవి కవులు, రచయితలను ఔరా అనిపించారు. గణనాథుడి పద్యంతో మొదలై 150 పద్యాలు చదవి వినిపించారు. సమకాలీన అంశాలను ఆధారంగా చేసుకొని ఆయన ఇంత వరకు పలు కవితలు రాశారు. తెలుగు భాష, పద్యాలపై తనకున్న పట్టుతో నన్నయ్య, తిక్కన, తిరుపతి వెంకట కవులు, దాశరథి తదితర కవుల నుంచి వచ్చిన పలు పద్యాలను, వాటి సారాంశాన్ని డాక్టర్ పెదవీర్రాజు చదవి వినిపించారు. తెలుగు భాష గొప్పతనాన్ని తనదైన శైలిలో ఆయన వినిపించారు. డాక్టర్ జి.రఘురామారావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ పెద వీర్రాజు, ముఖ్య అతిథి డాక్టర్ మీగడ రామలింగస్వామిలను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.

రైతుబజార్‌లోకి రాళ్లు విసురుతున్న గుర్తుతెలియని వ్యక్తులు

సీతమ్మధార: గుర్తు తెలియని కొందరు వ్యక్తులు సీతమ్మధార రైతుబజార్‌లోకి రాళ్లు విసురుతున్నారని పలువురు రైతులు చెబుతున్నారు. గతంలో రెండు సార్లు ఇలా జరగడంతో ప్రమాదం నుంచి తప్పించుకున్నామన్నారు. కొద్ది రోజుల కిందట బజార్ వెనుక భాగంలో ఉన్న ఓ అపార్ట్‌మెంట్ నుంచి రాళ్లు విసురుతున్నారని తెలిసి.. రైతుబజార్ సిబ్బంది అపార్ట్‌మెంట్ నిర్వాహకుల దృష్టికి తీసుకెళ్లడంతో పరిశీలిస్తామని వారు హామీ ఇచ్చారన్నారు. ఆదివారం మళ్లీ రాళ్లు విసరడంతో బజార్‌పైన రేకుల మీద పడటంతో ఒక్కసారిగా రైతులు ఉలిక్కిపడ్డారు. ఇక్కడ ప్రతి రోజూ వినియోగదారులు కూరగాయలు కొనుగోలు చేస్తుంటారు. ఆ సమయంలో ఎవరికైనా రాయి తగిలితే ఎవరు బాధ్యులని రైతులు వాపోయారు. ఈ ఘటనపై సీతమ్మధార రైతుబజార్ ఈవోకు రైతులు ఫిర్యాదు చేశారు.

నేడు సింహగిరిపై శాంతి కల్యాణం

సింహాచలం: సింహగిరిపై గంగధార వద్ద ఉన్న పురాతన సీతారామస్వామి ఆలయంలో సోమవారం సీతారాముల శాంతి కల్యాణం నిర్వహిస్తున్నట్టు సింహాచలం దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభం కానున్న కల్యాణంతో పాటు ఇతర పూజల్లో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఈవో కోరారు.

అంతటా రామనామ స్మరణ



కీర్తనలు ఆలపిస్తున్న శారద సుబ్రహ్మణ్యం శిష్య బృందం


మురళీనగర్‌లో ర్యాలీ చేస్తున్న మానవ సేవే మాధవ సేవ సభ్యులు

- అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన వేళ.. ప్రత్యేక కార్యక్రమాలు
- నేడు రామాలయాల్లో విశేష పూజలు

సీతమ్మధార: అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ట సందర్భంగా సోమవారం దేవాలయాలు, అపార్ట్‌మెంట్లలో విశేష కార్యక్రమాలు నిర్వహించనున్నారు. భజనలు, కీర్తనలు, సుందరకాండ పారాయణం, హనుమాన్ చాలీసా పారాయణం జరగనున్నాయి. ఉదయం 9 గంటలకు బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని రమా హాస్పిటల్ నుంచి గురువాయూర్ కృష్ణ మందిరం వరకు శోభాయాత్ర, మధ్యాహ్నం 12.30 గంటల వరకు భజనలు, కీర్తనలు తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఆలయాల్లో అయోధ్య అక్షింతలు పంపిణీ చేస్తారు.

శ్రీరాముడికి స్వర సమర్పణ

సీతంపేట: గణతంత్ర దినోత్సవం, అయోధ్య శ్రీరామ విగ్రహ ప్రతిష్టాపనలను పురస్కరించుకుని సంస్కార భారతి ఆధ్వర్యంలో ఆదివారం శంకర మఠంలో భరతమాత పూజా దినోత్సవం, డాక్టర్ శారద సుబ్రహ్మణ్యం శిష్య బృందంచే శ్రీరాముడికి స్వర సమర్పణ చేశారు. పలువురు గాయనీ గాయకులు రాముడిని స్తుతిస్తూ కీర్తనలు, రామదాసు ఆలపించిన కీర్తనలు పాడి అలరించారు.

బాలరాముడి విగ్రహ ప్రతిష్టాపనపై ర్యాలీ

మురళీనగర్: అయోధ్య రామ మందిరంలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు మానవ సేవే మాధవ సేవ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు సనపల భానుప్రకాష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు. నాలుగు దశాబ్దాల కల నెరవేరుతున్న తరుణంలో సోమవారం ప్రధాని నరేంద్రమోదీ చేతుల మీదుగా సీతారామలక్ష్మణ, ఆంజనేయ స్వామి విగ్రహాల ప్రతిష్ట జరుగుతుందని, ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించాలని వారు కోరారు. వర్మా కాంప్లెక్స్ నుంచి మురళీనగర్ రామాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ కార్యవర్గం సభ్యులు, స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



వైభవుడి ఆలయం వద్ద శోభాయాత్ర బ్యానర్ ఏర్పాటు చేసిన ఎన్‌జీజీవోస్ కాలనీ ప్రతినిధులు

శోభాయాత్ర

ఎన్‌జీజీవోస్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం శోభాయాత్ర నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆదివారం శోభాయాత్ర బ్యానర్‌ను కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద కాలనీ వెల్ఫేర్ సంఘం సభ్యులు ఆవిష్కరించారు. ఉదయం 8 గంటలకు వైభవ వేంకటేశ్వర స్వామి సన్నిధి నుంచి శోభాయాత్ర ప్రారంభిస్తామని నిర్వాహకులు చెప్పారు. ఇందులో భాగంగా రామనామ జపం, సంకీర్తనలు చేస్తామన్నారు. యాత్రకు స్వాగతం పలికే విధంగా ఇళ్ల వద్ద దీపారాధనలు, రంగవల్లులు ఏర్పాటు చేయాలని కాలనీవాసులకు పిలుపునిచ్చారు.

వేణుగోపాలస్వామి సన్నిధిలో రామనామ పారాయణ

మర్రిపాలెం: అయోధ్యలో శ్రీరామ విగ్రహ ప్రాణప్రతిష్టను పురస్కరించుకుని 51వ వార్డు మాధవధార మాధవస్వామి ఆలయ ప్రాంగణంలో కొలువైన వేణుగోపాలస్వామి సన్నిధిలో సోమవారం రామనామ పారాయణ చేస్తున్నట్టు ఆలయ అర్చకులు తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రాణప్రతిష్ట సమయంలో శ్రీరామనామం, పారాయణ, విశేష హారతి కార్యక్రమం నిర్వహిస్తామని శివాలయం అర్చకుడు నేదునూరి శ్రీనివాసశర్మ, మాధవస్వామి ఆలయ అర్చకుడు సనపల రవీంద్రకుమార్, వేణుగోపాలస్వామి ఆలయ అర్చకుడు రాధాకృష్ణ అనంతరామ్ తెలిపారు. భక్తులకు ప్రసాద వితరణ చేస్తామని, భక్తులందరూ పరోక్షంగా ప్రతిష్టలో పాల్గొన్నట్టు భావించి రామనామ సంకీర్తన చేసి తరించాలని కోరారు.

కూలిన చెట్టు.. విరిగిన స్తంభాలు


ఎన్జీజీవోస్ కాలనీలో విద్యుత్ స్తంభాలపై కూలిన చెట్టు


విరిగిన విద్యుత్ స్తంభాలు

సీతంపేట: అకస్మాత్తుగా చెట్టు కూలడంతో కొమ్మలు తగిలి నాలుగు విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వివరాలిలా.. జీవీఎంసీ 26వ వార్డు అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీలోని సాయిసూర్య రెసిడెన్సీ వద్ద ఉన్న చెట్టు ఆదివారం రాత్రి కూలిపోయింది. రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాలపై అది కూలడంతో నాలుగు స్తంభాలు విరిగిపడి వైర్లు తెగిపడ్డాయి. ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. నాలుగు లైన్లకు కరెంట్ సరఫరా నిలిచిపోయింది. వార్డు అధ్యక్షుడు ముక్కా కిశోర్ ఎలక్ట్రికల్, హార్టికల్చర్ అధికారులకు విషయం తెలియపర్చారు. సంబంధిత విభాగాల సిబ్బంది పునరుద్ధరణ చర్యలు చేపట్టారు.

రక్తదానం స్ఫూర్తిదాయకం


రక్తదాతకు సర్టిఫికెట్ అందజేస్తున్న వైద్య సిబ్బంది

సీతంపేట: అయోధ్య రామ మందిర ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని ఓం శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం అక్కయ్యపాలెం మహారాణి పార్లర్ వద్ద రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథి మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతూ దేశమంతా శ్రీరామ నామాన్ని జపించడం ఆనందంగా ఉందన్నారు. యువత ఇటువంటి కార్యక్రమాలు చేపట్టడం స్ఫూర్తిదాయకమన్నారు. సుమారు 75 మంది రక్తదానం చేశారు. రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు.